# అనుభవమార్గం



-రామా చంద్రమౌళి

'గోల్డన్ బర్డ్' రెస్టారెంట్।
గ్రీన్ రూంలో నిలువుటద్దం ముందు నిలబడి చూచుకుంది

రోజీ.
ఒంటిపైనున్న గుడ్డనంతా కొలిస్తే ఓ పావుమీటరుంటుం

దేమో! శరీరమంతా పాలరాయిలా మెరుస్తూ నిగనిగలాడుతోంది.

'ఈ ఒళ్ళే తన బ్రతుక్కి పెట్టుబడి'- నవ్వుకుంది.

గబగబా నడిచి 'పీప్ హోల్' నుంచి హాల్లోకి చూచింది ఆతురతగా.

జనం క్రిక్కిరిసి వున్నారు.

అనౌన్సర్ మైక్‌లో అరుస్తున్నాడు- 'రోజీకేబరే' డాన్స్ గురించి.

రోజీ అంటే వున్న క్రేజీతో జనం కేరింతలు కొడుతున్నారు పిచ్చిగా.

గిరుక్కున వెనుదిరిగి వచ్చి రెస్టారెంట్ బయట-మెయిన్ గేట్ వైపు చూచింది.

ఆమె ఇంకా అక్కడే ఆడుక్కుంటోంది.

పరిశీలనగా చూచిందామెను.

స్తంభం వెలుగులో ఆ ముఖం, మాసినలంగా, చిరుగుతున్న జాకెట్‌లో ఆమె పొంగే అందం....

నిట్టూర్చింది.

ఆలోచించింది.

మనసంతా ఆందోళన నిండి, నీటిలోపడ్డ రాయిలా బరువుగా అయింది.

"మేడమ్!"

ఎదురుగా బాయ్.

"టైమైంది."

"వస్తున్నాను-పద."

వెళ్ళిపోయాడు బాయ్.

నడిచింది నాజూగ్గా హంసలా.

దారిలో-మేనేజర్ గది...

తలతిప్పి చూచింది చటుక్కున.

మెరిసే బట్టతల కనిపించింది.

ఏదో రాసుకుంటున్నాడు.

హాల్లో కొచ్చి - అనౌన్సర్ ప్రక్కగా వచ్చి నిలబడింది.

లైట్లన్నీ ఆరిపోయాయి.

స్పాట్ లైట్ గుండ్రగా పైన బడింది. బాయ్ ఒంటిమీది జలతారు పొరను లాగి పారేశాడు.

ప్రేక్షకుల కళ్ళు జన్మజన్మల దాహంతో చూస్తున్నాయి మైకంలో, పిచ్చితో.

వెంటనే దయాస్పైనమ్యూజిక్ తుఫానులా విజృంభించింది- వరదలా ముంచుకొస్తూ.

ఊపు-సంగీతపు ఊపు- పెనుగాలిలా వూపేస్తోంది.

రోజీ కాళ్ళు మెరుపు తీగల్లా కదిలాయి. ఒళ్ళు సెలయేటి పాయల్లా వంపులు తిరిగింది.

పరుగు-పరుగు!

ప్రేక్షకుల నడుమ-ఎగురుతూ-గెంతుతూ- తాకుతూ- నవ్వుతూ-కవ్విస్తూ.

అందరిలోనూ మత్తు.

నోట్లు కురుస్తున్నాయి వానలా.

దాదాపు నగ్నంగా వున్న తన ఒంటిని పూర్తిగా - కనబడకుండా కప్పేయాలన్ని నోట్లు. నోట్లవరద!

అందర్నూ డబ్బులో పుట్టి-డబ్బులో పెరుగుతున్న వాళ్ళు. తన అందాన్ని తాగేయాలని తహ తహ లాడుతున్న వాళ్ళు.

రూపాయల ప్రవాహంలో, రోజీ ఈదుతోంది- గెంతుతూ.

ఎగిరి-ఎగిరి,
అందరిలో పిచ్చి రేపి-రేపి,
సంగీతం పరాకాష్టను చేరి-చేరి,

స్పాట్ లైట్ లో-ఒంటిపైనున్న జానెడు గుడ్డను కూడా పీకేస్తున్నట్లు 'షో' చేసి, తుర్రున లోపలికి పరుగెత్తింది.

పరుగెత్తుతూ - మేనేజర్ గది లోకి చూచింది.

రాసుకుంటున్నాడు.

"పాపం! పుణ్యాత్ముడు" అనుకుంది.

గ్రీన్ రూంలో బట్టలేసుకుంటూ బయటకు చూచింది.

ఆమె ఇంకా అడుక్కొం టోంది స్తంభం దగ్గర. ప్రేక్షకుల కార్లు చీమల దండులా వెళుతున్నాయి.

గబగబా దిగివచ్చి కారులో కూర్చుంది.

కారు గేటు దగ్గరకు రాగానే ఆపి, అడుక్కుంటున్న అమ్మాయిని పిలిచి, "నీ పేరు?" అనడిగింది.

"లచ్మి."

"నీ కెన్నేళ్ళు?"

"పదిహేడు."

"ఎందుకడుక్కుంటున్నావు?"

ఆ అమ్మాయి ఒంటిని అతి జాగ్రత్తగా పరీక్షిస్తోంది రోజీ. అంగ నిర్మాణం ఎంతో ఆకర్షణీయంగా వుంది.

"మాదీవూరు కాదు,పల్లెటూరు. మా అవ్వ సచ్చిపోయింది. ఎవ్వల్లేకుంటె పట్నమొచ్చి అడుక్కుంటాన."

"నా దగ్గర పని చేస్తావా?"

"ఆఁ." కళ్ళనిండా సంతోషం.

"ఐతే కారెక్కు!"

భయంగా ఎక్కింది.

పోనిచ్చింది కారును వేగంగా.

ఆ రాత్రి—

వంటింట్లోని పాత్రలన్నిటినీ తోమి, నేలమీద పడుకున్న లక్ష్మిని చూచి సంతోషంగా నిట్టూర్చి వచ్చి, ఫోయిగా డన్‌లప్ బెడ్‌పై పడు కున్న రోజీకి చటుక్కున మేనేజర్ జ్ఞాపకమొచ్చాడు.

అందమైన ఆడ బిచ్చగాండ్లను కేబరే డ్యాన్సర్లుగా తయారుచేసే అతని తెలివీ, అలవాటు- జ్ఞాపక మొచ్చాయి.

రెండేళ్ళ క్రితం 'గోల్డన్ బర్డ్' దగ్గర తను బిచ్చమెత్తుకొన్న సంగతీ, రాజీయైన తను రోజీగా మారిన సంగతీ జ్ఞాపకమొచ్చాయి.

ఇప్పుడీ లక్ష్మి ఏ లారెన్సో కాకుండా....

నేలపై పడుకున్న లక్ష్మి వైపు చూచింది రోజీ.

నిట్టూర్చింది ఆనందంగా.


## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు–ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగు తుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజన ముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠ కులు; తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్

'విజయ'

80- ధనలక్ష్మికాలనీ,

మద్రాసు- 600 026